క్లుప్తంగా

నేడు గడప గడపకు మన ప్రభుత్వం

రాచర్ల: మండలంలోని గుడిమెట్ట సచివాలయం పరిధి ఒద్దులవాగుపల్లెలో బుధవారం సాయంత్రం 3 గంటలకు గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించనున్నట్లు వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ యేలం మురళీకృష్ణ మంగళవారం తెలిపారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే అన్నా వెంకట రాంబాబు హాజరవుతారని పేర్కొన్నారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమానికి మండలంలోని జెడ్పీటీసీ, సర్పంచ్‌లు, ఎంపీటీసీలతో పాటు వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు భారీ సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు.

మిశ్రమ పంటల సాగుతో మేలు

తాళ్లూరు (ముండ్లమూరు): మిశ్రమ ఆహార పంటల సాగు ద్వారా భూమిలో జీవవైవిధ్యం పెంపొందుతుందని మండల వ్యవసాయాధికారి బి.ప్రసాదరావు తెలిపారు. బొద్దికూరపాడులో మంగళవారం రైతులకు అవగాహన కల్పించారు. ఓఈఓ నాగరాజు, వీఏఏ అజ్మీర్, రైతులు పాల్గొన్నారు.

విద్యుత్ చౌర్యానికి పాల్పడితే చర్యలు

తాళ్లూరు (ముండ్లమూరు): గ్రామాల్లో అక్రమ విద్యుత్ వినియోగదారుల పట్ల కఠినంగా వ్యవహరించాలని విద్యుత్‌శాఖ విజిలెన్స్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ టి. శ్రీనివాసరావు తెలిపారు. మంగళవారం 3324 విద్యుత్ సర్వీసులను తనిఖీ చేశారు. భారీ మొత్తంలో అపరాధ రుసుం విధించారు. ఈఈ ఆపరేషన్ ఎస్ఏ కరీం, డీఈఈలు పిచ్చయ్య, డీవీ కృష్ణారెడ్డి, ఏఈ వీరబ్రహ్మం పాల్గొన్నారు.

అన్యాయాన్ని ప్రశ్నించాలి

పొదిలి: అన్యాయాలను ప్రశ్నించడం ద్వారా హక్కులు పరిరక్షించాల్సిన బాధ్యత హ్యూమన్ రైట్స్ సభ్యులపై ఉందని వినియోగదారుల రక్షణ సమితి అధ్యక్షుడు ధర్నాసి రామారావు అన్నారు. మంగళవారం స్థానిక కార్యాలయంలో పదవులు పొందిన వారికి నియామక పత్రాలు అందించారు. రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా జేఎస్ జహంగీర్ బాషా, రాష్ట్ర సంయుక్త కార్యదర్శిగా మేడా నరసింహారావు, జిల్లా ఉపాధ్యక్షులుగా సానికొమ్ము వెంగళరెడ్డికి జాతీయ మానవ హక్కుల కమిషన్ నుంచి వచ్చిన నియామక పత్రాలు, ఐడీ కార్డులను అందజేశారు.

సచివాలయానికి తాళం

రాచర్ల: సచివాలయానికి తాళాలు వేసిన సంఘటన మండలంలోని చినగానిపల్లెలో మంగళవారం జరిగింది. వివరాలు.. గ్రామానికి చెందిన పి.రాజశేఖర్‌కు చెందిన ఇంట్లో సచివాలయాన్ని ఏర్పాటు చేశారు. ప్రతి నెలా క్రమం తప్పకుండా ఇంటి అద్దె ఇస్తున్నారు. చినగానిపల్లె సచివాలయానికి డీడీవోగా పనిచేస్తున్న గుడిమెట్ట పంచాయతీ కార్యదర్శి ప్రతాప్ రెడ్డి సోమవారం ఒంగోలులో జరిగే శిక్షణకు వెళ్లిపోయారు. ఒక్క రోజు ఇంటి అద్దె ఆలస్యం చేయడంతో ఇంటి యాజమాని గేటుకు తాళం వేసి తాళం చెవిని ఇంటి పక్కనే ఉన్న వ్యక్తికి ఇచ్చి గిద్దలూరు వెళ్లిపోయాడు. ఈ విషయం తెలుసుకున్న ఎంపీడీవో కె.కవితా చౌదరి వెంటనే డీడీవో ద్వారా ఇంటి అద్దెను ఫోన్‌పే ద్వారా చెల్లించారు. అనంతరం ఎంపీడీవో మాట్లాడుతూ ఇంటి అద్దె విషయంలో సచివాలయ ఉద్యోగులకు విధులకు ఆటంకం చేయకూడదని ఇంటి యజమానికి సూచించారు.

పరిమితికి మించి ఎక్కించవద్దు

దర్శి: పరిమితికి మించి వాహనాల్లో ప్రజలను ఎక్కించి ఇబ్బందులు పెట్టవద్దని ఎమ్‌వీఐ రవికుమార్ అన్నారు. స్థానిక ఆర్టీసీ బస్టాండ్ సమీపంలో 22 వాహనాలను తనిఖీ చేసి రూ. 50 వేల వరకు జరిమానా విధించారు. పొదిలి డిపో ఆర్టీసీ డీఎం జె. సుందరరావు, అసిస్టెంట్ డీఎం ధనలక్ష్మి, దర్శి డిపో ఎంక్వయిరీ సూపర్ వైజర్ జవ్వాజి రామయ్య పాల్గొన్నారు.

క్రీడల్లో గెలుపోటములు సహజం



మార్కాపురంలో గేమ్స్‌ను ప్రారంభిస్తున్న ఎంఈఓలు

మార్కాపురం టౌన్: క్రీడల్లో గెలుపోటములు సహజమని మార్కాపురం ఎంఈఓ-1, 2 రాందాస్‌నాయక్, శ్రీనివాసులు పేర్కొన్నారు. మంగళవారం స్థానిక జడ్పీ బాలుర ఉన్నత పాఠశాల ఆవరణలో స్కూల్ గేమ్స్ సెలెక్షన్స్‌ను వారు ప్రారంభించారు. గెలుపోటములను సమానంగా స్వీకరించాలని సూచించారు. కార్యక్రమంలో 11వ వార్డు ఇన్‌చార్జి ఉత్తమ్‌కుమార్, 18వ వార్డు కౌన్సిలర్ కరీముల్లా, మండల కోఆర్డినేటర్ బాబూరావు, హెచ్‌ఎంలు వెంకటేశ్వర్లు, తిరుపతిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పొదిలి: స్థానిక ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో స్కూల్ గేమ్స్ సెలక్షన్‌ను ఎంఈఓ ఎం.శ్రీనివాసరెడ్డి ప్రారంభించారు. వాలీబాల్, కబడ్డీ, ఖోఖో క్రీడలకు సంబంధించి అండర్-14, అండర్-17 క్రీడాకారులను ఎంపిక చేసినట్లు పీఈటీ ప్రసాద్ తెలిపారు. బుధవారం బాల్ బ్యాడ్మింటన్, అథ్లెటిక్స్ నిర్వహిస్తామన్నారు. ప్రభుత్వ బాలికల పాఠశాల హెచ్‌ఎం కుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో క్రీడాకారులకు మజ్జిగ ప్యాకెట్లు అందించారు.



పొదిలిలో ఎంపిక చేసిన క్రీడాకారులతో ఉపాధ్యాయులు

క్రీడలపై ఆసక్తి పెంచుకోవాలి

బేస్తవారిపేట: క్రీడలపై ఆసక్తి పెంచుకుని గుర్తింపు తెచ్చుకోవాలని ఎంఈఓ చేగిరెడ్డి రమణారెడ్డి అన్నారు. మంగళవారం స్థానిక జెడ్పీ బాలుర హైస్కూల్ ఆవరణలో మండల స్థాయి స్కూల్ గేమ్స్ క్రీడా పోటీలు, సెలక్షన్ పోటీలు నిర్వహించారు. గ్రామీణ స్థాయిలోని విద్యార్థుల్లో దాగుతున్న క్రీడా నైపుణ్యాలను వెలికి తీసేందుకు పోటీలు ఉపయోగపడుతాయని తెలిపారు. మండల స్థాయి పోటీల్లో వాలీబాల్, త్రోబాల్, పుట్‌బాల్, టెన్నికాయిట్, బాల్ బాడ్మింటన్, యోగా, అథ్లెటిక్స్ పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనపరిచిన విద్యార్థులను ఎంపిక చేస్తామని చెప్పారు. ఆటల పోటీలతో విద్యార్థుల్లో పోటీతత్వం పెరుగుతుందని, శారీరక, మానసిక దృఢత్వం ఏర్పరచుకుంటారన్నారు. హెచ్‌ఎంలు ఎంఎస్ శర్మ, కె.తిరుపతిరెడ్డి, ఉపాధ్యాయులు, పీఈటీలు పాల్గొన్నారు.

కంభం: విద్యార్థులు చదువుతో పాటు క్రీడలపై ఆసక్తి పెంచుకోవాలని ఎంపీపీ చేగిరెడ్డి తులశమ్మ అన్నారు. స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో నిర్వహిస్తున్న మండల స్థాయి క్రీడల పోటీలను మంగళవారం ఆమె ప్రారంభించారు. అనంతరం క్రీడాకారులను పరిచయం చేసుకున్నారు. మండల స్థాయిలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులను ఎంపిక చేసి నియోజకవర్గ స్థాయి, జిల్లా స్థాయి పోటీల్లో పాల్గొనే ఏర్పాట్లు చేయనున్నట్లు స్పోర్ట్స్ కోఆర్డినేటర్, పీడీ సుబ్రహ్మణ్యం తెలిపారు. వైఎస్సార్ సీపీ నాయకుడు చేగిరెడ్డి ఓబుల్‌రెడ్డి, సీఆర్పీ మురళి పాల్గొన్నారు.

పుల్లలచెరువు: విద్యార్థులు విద్యతో పాటు క్రీడలకు ప్రాధాన్యం ఇవ్వాలని తహసీల్దార్ దాసు అన్నారు. మంగళవారం పిడికిటివానిపల్లి జెడ్పీ పాఠశాలలో జరుగుతున్న అండర్-,14, 17 బాల, బాలికల మండలస్థాయి క్రీడా టోర్నమెంట్ ఎంపిక ప్రక్రియను తహసీల్దార్ దాసు, ఎంపీడీవో మరియదాసు, ఎంఈవో శామ్యూల్ జాన్ ప్రారంభించారు. హెచ్‌ఎం, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఉల్లాసంగా ఆటల పోటీలు

దొనకొండ: స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలో మంగళవారం మండల స్థాయి ఆటల పోటీలు ప్రారంభమయ్యాయి. మండల విద్యాధికారులు ఎస్.సాంబశివరావు, షేక్ అమీర్ ఆటల పోటీలను ప్రారంభించారు. రెండు రోజుల పాటు జరిగే పోటీల్లో పాల్గొన్న టీములను ఎంపిక చేసి నియోజకవర్గ స్థాయి పోటీలకు పంపనున్నట్లు తెలిపారు.

పెద్దదోర్నాల: క్రీడలు మానసిక ఉల్లాసానికి దోహదపడతాయని ఎంఈఓ మస్తాన్‌నాయక్ పేర్కొన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో మండల స్థాయి వాలీబాల్ పోటీలను ఆయన ప్రారంభించారు. ప్రభుత్వ ఉన్నత పాఠశాల, బాలుర గురుకుల పాఠశాల, బాలికల గురుకుల పాఠశాల, ఏకలవ్య గురుకుల పాఠశాల విద్యార్థులు పోటీల్లో పాల్గొన్నారు. ఏకలవ్య పాఠశాల ప్రిన్సిపాల్ శామ్యేల్ జోబ్, ఫిజికల్ డైరెక్టర్స్ సుబ్రహ్మణ్యం, రామానాయక్ పాల్గొని క్రీడలు నిర్వహించారు.

క్రీడల్లో రాణిస్తే ఉజ్వల భవిష్యత్

ముండ్లమూరు: విద్యార్థులు క్రీడల్లో రాణిస్తే ఉజ్వల భవిష్యత్ ఉంటుందని ఎంఈఓ వెంకటేశ్వర్లు అన్నారు. మండల కేంద్రమైన ముండ్లమూరులో మంగళవారం స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆంధ్రప్రదేశ్ వారి ఆధ్వర్యంలో అండర్ 14, 17 విభాగాల్లో ఆటల పోటీలు నిర్వహించారు. అండర్ 14 విభాగంలో ఓగులూరి గోపీచంద్ మొదటి స్థానం, తాతపూడి దినేష్ ద్వితీయ స్థానం, అండర్ 17 విభాగంలో తాతపూడి జెస్సీ పాల్ మొదటి స్థానం, మైలవరపు బాషా ద్వితీయ స్థానంలో నిలిచారు. హెచ్‌ఎం మాధవీలత, మండల స్పోర్ట్స్ కోఆర్డినేటర్ జి. భావన్నారాయణ, పాల్గొన్నారు.

దర్శి: స్థానిక గవర్నమెంట్ హైస్కూల్‌లో జరిగిన మండల స్థాయి ఆటల పోటీలు ఉత్సాహంగా జరిగాయి. ఎంఈఓ -2 బీ.రమాదేవి ప్రభుత్వ జూనియర్‌కళాశాల ప్రిన్సిపాల్ ఎస్. సుబ్బారావు, హైస్కూల్ ప్రధానోపాధ్యాయులు ఎస్‌కే కాలేషావలి ప్రారంభించారు. సీహెచ్ సాంబశివయ్య, పీడీ సోము అంజిరెడ్డి పాల్గొన్నారు.



పొదిలిలో ప్రారంభిస్తున్న ఎంఈఓ శ్రీనివాసరెడ్డి



వాలీబాల్ ఆడుతున్న ఎంఈవో శామ్యూల్ జాన్



కంభంలో క్రీడల పోటీలు ప్రారంభిస్తున్న ఎంపీపీ



స్కూల్ గేమ్స్‌ను ప్రారంభిస్తున్న ఎంఈఓ రమణారెడ్డి



ఆటల పోటీలను ప్రారంభిస్తున్న ఎంఈఓలు



పెద్దదోర్నాలలో వాలీబాల్ పోటీలు



ముండ్లమూరులో..



దర్శి: కబడ్డీలో ఉత్సాహంగా తలపడుతున్న క్రీడాకారులు

ఘనంగా శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు



శ్రీకృష్ణుడి గ్రామోత్సవం



కోలాటం ప్రదర్శిస్తున్న మహిళలు, చిన్నారులు

మార్కాపురం రూరల్: మండలంలోని బోడపాడు గ్రామంలో త్రైతసిద్ధాంత ప్రబోధ సేవాసమితి, ఇందూ జ్ఞాన వేదిక కమిటీ ఆధ్వర్యంలో శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకల్లో భాగంగా మంగళవారం శ్రీకృష్ణభగవానుడి విగ్రహ ఊరేగింపు వైభవంగా నిర్వహించారు. చిన్నారులు, మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొని శ్రీకృష్ణుని గీతాలకు కోలాటం నృత్యం ప్రదర్శించారు. కార్యక్రమంలో ఇందూ జ్ఞాన వేదిక కమిటీ అధ్యక్షుడు ఏడుకొండలు, రమేష్, శ్రీనివాసరెడ్డి, శ్రీనివాసులు, వీరాంజనేయులు, సైదారావు, బోడపాడు గ్రామస్తులు ఎ.చెన్నకేశవులు, బాలరంగయ్య, జి.రంగారెడ్డి, బి.సత్యనారాయణరెడ్డి, రమణారెడ్డి, మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

ఉత్తమ ఉపాధ్యాయునికి సత్కారం



వెంకటరెడ్డిని సన్మానిస్తున్న పాఠశాల ఉపాధ్యాయులు

దర్శి: జిల్లా ఉత్తమ ఉపాధ్యాయునిగా అవార్డు అందుకున్న పోతవరం మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో ఎల్ఎఫ్ఎల్‌గా పని చేస్తున్న ధనిరెడ్డి వెంకటరెడ్డిని ఆపాఠశాలలో మంగళవారం సత్కరించారు. ఉపాధ్యాయులు మాధవి, బసంతి, ఖాశీం .కల్పన, వీరాంజనేయులు మాట్లాడుతూ వెంకటరెడ్డి తన సొంత నిధులతో పాఠశాలను అభివృద్ధి చేశారని కొనియాడారు.

100 కి.మీ పూర్తయిన 'జగన్ మరోమారు సీఎం' పాదయాత్ర



లింగారెడ్డి కాలనీలో వైఎస్సార్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న నాయకులు

తర్లుపాడు: ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మరోమారు అఖండ విజయం సాధించాలని ఆకాంక్షిస్తూ సింగరాయకొండ వైఎస్సార్ సీపీ యువజన విభాగం అధ్యక్షుడు శీలం రాము ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న పాదయాత్ర మంగళవారం తర్లుపాడు మండలంలోని లింగారెడ్డి కాలనీకి చేరుకుంది. పాదయాత్ర 100 కిలో మీటర్లు పూర్తయిన సందర్భంగా కాలనీలోని వైఎస్సార్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. స్థానికులతో కలిసి పాదయాత్ర బృంద సభ్యులు కేక్ కట్ చేసి స్వీట్లు పంచారు. వైఎస్సార్ సీపీ వైద్య విభాగం రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ బత్తుల అశోక్ కుమార్‌రెడ్డి పాల్గొని సంఘీభావం ప్రకటించారు. మంగళవారం రాత్రికి మార్కాపురం మండలంలోని కాశినాయన ఆశ్రమానికి పాదయాత్ర చేరుకోనుందని తెలిపారు. తొలుత పాదయాత్ర బృందానికి స్థానిక నాయకులు మందా కొండారెడ్డి, వైస్ సర్పంచ్ శిరీష దేవదాసు, ఇసాకు ఆధ్వర్యంలో ఘనస్వాగతం పలికారు. కార్యక్రమంలో ఏఎంసీ మాజీ చైర్మన్ ప్రభావతి, మాజీ సర్పంచ్ సీహెచ్ కిరణ్‌కుమార్, మైనార్టీ సెల్ అధ్యక్షుడు నౌషాద్, చొప్పర వెంకన్న, రోశయ్య, శ్రీనివాసరెడ్డి, హనుమంతరావు, అల్లా ఉజ్వల్, సురేష్, శీలం శ్రీను, రమేష్ పాల్గొన్నారు.

వేగంగా భూముల రీసర్వే

తర్లుపాడు: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన భూముల రీసర్వే మండలంలో వేగంగా సాగుతోంది తహశీల్దార్ అబ్దుల్ హమీద్ తెలిపారు. మండలంలోని చెన్నారెడ్డిపల్లిలో మంగళవారం ఆయన డ్రోన్ ఫ్లైన్ను ప్రారంభించారు. మండలంలో ఇప్పటికే కారుమానిపల్లి, జగన్నాథపురం, కందళ్లపల్లి, ఫత్తేపురం, సూరేపల్లిలో సర్వే పూర్తయినట్లు తెలిపారు. కారుమానిపల్లి, జగన్నాథపురం గ్రామాల్లో నూతన పట్టాదారు పాస్‌బుక్‌లు రైతులకు అందించినట్లు పేర్కొన్నారు. ఆధునిక టెక్నాలజీ వినియోగించి భూముల డిజిటల్ రికార్డులు సిద్ధం చేస్తున్నట్లు వెల్లడించారు. రీసర్వే పూర్తయితే రైతులకు ఎంతో ప్రయోజనం చేకూరుతుందన్నారు. వీఆర్ఓ, గ్రామ సర్వేయర్, వీఆర్ఏలతో కూడిన బృందానికి రోజూ 40 ఎకరాల భూమిని సర్వే చేయాలని లక్ష్యంగా నిర్దేశించినట్లు తెలిపారు.



చెన్నారెడ్డిపల్లిలో డ్రోన్ సర్వేను ప్రారంభిస్తున్న తహసీల్దార్ అబ్దుల్ హమీద్

కార్యక్రమంలో సర్పంచ్ ఎం.సుబ్బమ్మ, సొసైటీ ప్రెసిడెంట్ సత్యనారాయణరెడ్డి, ఎంపీటీసీ వెంకటయ్య, వైఎస్సార్ సీపీ నాయకులు శ్రీకాంత్‌రెడ్డి, వీఆర్ఓ చిన్న సిద్ధయ్య, గ్రామ సర్వేయర్లు వై.కాశీమస్తాన్‌రెడ్డి, వెంకటరెడ్డి, తర్లుపాడు వీఆర్ఓ ఎస్.విజయభాస్కర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు నగదు బహుమతులు

తర్లుపాడు: స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బిగ్ హెల్ప్ సంస్థ ఆధ్వర్యంలో నగదు బహుమతులను హెచ్‌ఎం ఎం.సుధాకర్ చేతులమీదుగా మంగళవారం అందజేశారు. 6 నుంచి 10వ తరగతి విద్యార్థుల్లో అత్యధిక మార్కులు సాధించి ప్రథమ, ద్వితీయ స్థానాల్లో నిలిచిన విద్యార్థులకు నగదు అందించారు. విద్యార్థులు చదువులో రాణించాలని సంస్థ ప్రతినిధులు ఆకాంక్షించారు. బిగ్‌హెల్ప్ సంస్థ సేవలను హెచ్‌ఎం కొనియాడారు. కార్యక్రమంలో ప్రాజెక్టు డైరెక్టర్ జి.శ్రీనివాసులు, సంస్థ ప్రతినిధులు వి.చంద్రశేఖరరెడ్డి, ఏవీఆర్ నేతాజీరెడ్డి, ఎం.రమణ, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

గృహ నిర్మాణాలు వేగవంతం చేయాలి

రాచర్ల: గృహనిర్మాణాలను వేగవంతం చేయాలని ఎంపీడీవో కె.కవితా చౌదరి అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో సచివాలయ ఇంజినీరింగ్ అసిస్టెంట్లతో మంగళవారం ఆమె సమావేశమై మాట్లాడారు. జగనన్న కాలనీల్లో గృహ నిర్మాణాలు పూర్తికాని వాటిని గుర్తించి వాటిని త్వరగా పూర్తి చేయాలన్నారు. పూర్తయిన గృహాలకు మరుగుదొడ్ల బిల్లులు త్వరగా పూర్తి చేయాలన్నారు. గృహాల వద్ద ఇంకుడు గుంతలు ఏర్పాటు చేసుకున్న వారికి రూ.6 వేలు జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా మంజూరు చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. గృహనిర్మాణశాఖ ఏఈ విజయలక్ష్మి, సచివాలయ ఇంజినీరింగ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

ప్రభుత్వ ఉన్నత పాఠశాల తనిఖీ

పెద్దదోర్నాల: మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలను మార్కాపురం డివిజన్ ఉప విద్యాశాఖాధికారి పి.చంద్రమౌళీశ్వర్ మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా సిబ్బంది హాజరు పట్టీని, మధ్యాహ్న భోజనం రిజిస్టర్లను ఆయన పరిశీలించారు. అనంతరం విద్యార్థులకు ఏర్పాటు చేసిన మధ్యాహ్న భోజనాన్ని రుచి చూసి సంతృప్తి వ్యక్తం చేశారు. పులిహోరను ఉప్పు, పులుసు తగిన పాళ్లలో వేసి మరింత రుచికరంగా తయారు చేయించాలని సూచించారు. బియ్యం, చిక్కీలు, కోడిగుడ్లు స్టాక్‌ను పరిశీలించారు. ఫేషియల్ అటెండెన్స్ రిజిస్టర్, ట్యాబ్ రిజిస్టర్స్ నిర్వహించాలని సూచించారు. మండల విద్యాశాఖాధికారులు బి.మస్తాన్ నాయక్, కొండలరావు, ఇన్‌చార్జ్ ప్రధానోపాధ్యాయుడు వి.నాగమూర్తి పాల్గొన్నారు.

అనుమతులు తప్పనిసరి

దర్శి: వినాయక చవితి వేడుకలు నిర్వహించాలనుకునే వారు తప్పని సరిగా కమిటీ వారు హాజరై అనుమతులు తీసుకోవాలని డీఎస్పీ అశోక్‌వర్ధన్ రెడ్డి మంగళవారం సూచించారు. మండపాల వద్ద ఆర్గనైజింగ్ కమిటీ ప్రతినిధులు కాపలా ఉండాలని చెప్పారు.

చందవరంలో రుణ మేళా

దొనకొండ: మండలంలోని చందవరం ఆర్‌బీకే పరిధిలోని దేశిరెడ్డిపల్లి, బట్టిపాడు గ్రామాల్లో జగనన్న పాల వెల్లువ రుణ మేళా కార్యక్రమం అధికారులు మంగళవారం నిర్వహించారు. పీడీసీసీ బ్యాంక్ మేనేజర్ శ్రీనివాసరావు, వైకేపీ ఏపీఎం జి.వెంకటేశ్వర్లు, పశు వైద్యాధికారి కరిష్మ, సర్పంచ్ వజ్రగిరి రాణి సోలోమన్, పాల వెల్లువ రూట్ అధికారి బి.బాలయ్య, సీసీలు కోటేశ్వరరావు, వీఓఏలు పాల్గొన్నారు.

15 నుంచి జగనన్న ఆరోగ్య సురక్ష సర్వే

మద్దిపాడు: మండలంలోని ప్రతి సచివాలయ పరిధిలో 15వ తేదీ నుంచి జగనన్న ఆరోగ్య సురక్ష సర్వే కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఆసుపత్రి డాక్టర్ బి. జగదీష్ తెలిపారు. 29వ తేదీ లోపు పూర్తి సర్వే నిర్వహించాలని, 30 నుంచి మెడికల్ క్యాంపులు నిర్వహిస్తామని తెలిపారు.

జగనన్న ఆరోగ్య సురక్షతో వైద్య సేవలు

తాళ్లూరు (ముండ్లమూరు): జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం ద్వారా ఇంటింటికీ వైద్యసేవలు అందుబాటులోకి వస్తున్నాయని తాళ్లూరు వైద్యాధికారి షేక్ ఖాధర్ మస్తాన్‌బీ అన్నారు. స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మంగళవారం సిబ్బందికి జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంపై శిక్షణ నిర్వహించారు. రోగులకు అవసరమైన ఈసీజీ , అన్ని రకాల రక్త పరీక్షలు నిర్వహిస్తామన్నారు. వైద్యాధికారి రాజేష్ యాదవ్, ఏఎన్ఎంలు, సిబ్బంది పాల్గొన్నారు.



యర్రగొండపాలెం నియోజకవర్గ సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి ఆదిమూలపు సురేష్



గిద్దలూరు నియోజకవర్గ సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే అన్నా రాంబాబు



మార్కాపురం నియోజకవర్గ సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డి



దర్శి నియోజకవర్గ సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మద్దిశెట్టి వేణుగోపాల్



దర్శి నియోజకవర్గ సమీక్ష సమావేశానికి హాజరైన నాయకులు, కార్యకర్తలు



గిద్దలూరు నియోజకవర్గ సమీక్ష సమావేశానికి హాజరైన వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు



యర్రగొండపాలెం నియోజకవర్గ సమీక్ష సమావేశానికి హాజరైన వైఎస్సార్ సీపీ నాయకులు,కార్యకర్తలు



మార్కాపురం నియోజకవర్గ సమీక్ష సమావేశానికి హాజరైన వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు